చెన్నాపురం బడిని కూల్చొద్దు

రోడ్డు విస్తరణలో స్కూల్‌కు మార్కింగ్

- బడులను నిర్వీర్యం చేస్తున్న కాంగ్రెస్
- కన్నీళ్లు పెట్టుకుంటున్న పూర్వ విద్యార్థులు
- ప్రభుత్వం స్థలం కేటాయించాలని వేడుకోలు

జవహర్‌నగర్, జనవరి 28: పాఠశాల దేవాలయం లాంటింది.. సమాజ భవిష్యత్తుకు పునాది రాయిలాంటిది.. అలాంటిది చెన్నాపురం పాఠశాల రోడ్డు విస్తరణలో పోతుందంటే.. పూర్వ విద్యార్థులు, జవహర్‌నగర్ వాసులు బడిని కాపాడాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. 1964లో ఏర్పడిన చెన్నాపూర్ ప్రాథమిక పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థానాల్లో సేవలందిస్తున్నారు. పాఠశాల చెన్నాపూర్ ఊరిలో లేకుంటే చెన్నాపూర్ అస్థిత్వం సమసిపోతుందని చెన్నాపూర్ వాసులు అంటున్నారు. 60 ఏండ్ల నాటి బడిని కూల్చొద్దని వేడుకుంటున్నారు.

ఉన్నత స్థానాల్లో విద్యార్థులు..

చెన్నాపూర్ పాఠశాల గదులు కుంగిపోయి.. ఒకే ఒక్క రూము ఉండటంతో అందులోనే ఐదు తరగతులకు సంబంధించిన విద్యార్థులకు బోధన చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మనబడి పథకంతో పాఠశాలను బలోపేతం చేస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం సర్కారు బడులను నిర్వీర్యం చేస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 100 ఫీట్ల రోడ్డు విస్తరణ చేస్తుండగా చెన్నాపూర్ పాఠశాల పూర్తిగా పోతుంది. పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థానాల్లో సేవలందిస్తున్నారు. చదువుతోనే దేశ భవిష్యత్తు మార్పుగలమని.. చెన్నాపూర్ బడిలో విద్యాభ్యాసం చేసిన పూర్వవిద్యార్థులు పాఠశాలను కూల్చ వద్దని.. ప్రభుత్వం స్థలం కేటాయించి విశాలమైన పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఒకే గదిలో ఐదు తరగతులు..

చెన్నాపూర్ పాఠశాలలో సుమారు 70మంది విద్యార్థులు చదువుతున్నారు. ముగ్గురు ఉపాధ్యాయులు ఉండగా... ఒకే గదిలో ఐదు తరగతులకు బోధన చేయడం కష్టంగా మారింది. ఒకరికి క్లాసులు చెబుతుండగా... మరో క్లాసు విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. ఆట స్థలం లేకపోవడంతో చిన్నారులకు మానసిక, శారీరక ఎదుగుదల లేకుండా పోయింది.


చెన్నాపూర్ ప్రభుత్వ పాఠశాల

ఈ బడిలోనే చదివా.. సేవ చేస్తున్నా..

చెన్నాపూర్ ప్రభుత్వ బడిలో చదువుకుని జవహర్‌నగర్‌కు మూడు సార్లు సర్పంచ్‌గా ఎన్నికయ్యా.. ప్రజలకు మెరుగైన సేవలందించా. పూర్తిగా పేద ప్రజలు నివసించే జవహర్‌నగర్‌కు గతంలో చెన్నాపూర్ పాఠశాలే కార్పొరేట్ పాఠశాలగా ఉండేది. ఈ బడిలో చదువుకోవడం అదృష్టంగా భావిస్తున్నా. చదువుతోనే జీవితం మారుతుంది.

– శంకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ జవహర్‌నగర్

గ్రిల్స్ పెట్టుకొని బోధిస్తున్నాం

100 ఫీట్ల రోడ్డు విస్తరణలో చెన్నాపూర్ పాఠశాల పోతుందని ఇప్పటికే అధికారులు మార్కింగ్ చేశారు. అసలే ఒకే రూములో గ్రిల్స్ పెట్టుకుని విద్యార్థులకు బోధన చేస్తున్నాం. క్రీడా మైదానాలు లేకపోవడంతో కాలనీ రోడ్లపై చిన్నారులకు ఆటలు ఆడిస్తున్నాం. పాఠశాల పూర్తిస్థాయిలో పోతుంది... విద్యార్థులకు చదువు చెప్పడం కష్టంగా మారుతుంది. పాఠశాలకు స్థలం కేటాయించాలి.

– కమల వాసిని ఉపాధ్యాయురాలు

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా..

చెన్నాపూర్ పాఠశాల ఒకే గదిలో కొనసాగుతుంది. మార్కింగ్ చేసిన ప్రకారం... కొంతమేర మాత్రమే మిగులుతుంది. ఒకే గదిలో ఐదు తరగతులు కొనసాగడం కూడా కష్టంగా ఉంది. నష్టపరిహారం చెల్లించేది కూడా మాకు ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదు. త్వరలోనే కలెక్టర్, డీఈవో దృష్టికి తీసుకెళ్తా..పాఠశాలకు స్థలాన్ని కేటాయిస్తేనే పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుంది.

– బాపురెడ్డి, కాప్రా ఎంఈవో

బండి సంజయ్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

కొండాపూర్, జనవరి 28 : పద్మ అవార్డుల గురించి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన అభిప్రాయాన్ని చెప్పొచ్చు.. కానీ బాధ్యత గల పదవిలో ఉన్నప్పుడు గద్దరన్న మీద అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ డాక్టర్ వెన్నెల అన్నారు. మంగళవారం మాదాపూర్‌లోని తెలంగాణ సాంస్కృతిక సారథి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గద్దర్ వ్యక్తి కాదు.. తెలంగాణ ప్రజల గుండె చప్పుడు.. తెలంగాణ ప్రజల ఆశ అని అన్నారు. తెలంగాణ సమాజాన్ని కించపరిచేలా కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యాలపై రెండు రాష్ర్టాల ప్రజలు స్పందించాలన్నారు. బీజేపీ నాయకుల ఇంట్లో నుంచి అవార్డులను ఇస్తున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. గద్దర్‌కు ఏ అవార్డు ఇచ్చిన తక్కువేనని, పద్మ అవార్డులు లభిస్తే గౌరవంగా భావిస్తామన్నారు. గద్దర్ కుటుంబానికి, తెలంగాణ ప్రజలకు ఆయన వెంటనే క్షమాపణలు చేప్పాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ డాక్టర్ వెన్నెల

బీజేపీని భూస్థాపితం చేస్తాం..

బడంగ్‌పేట: గద్దరన్న పై కేంద్రం హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వాఖ్యలను భేషరత్‌గా వెనక్కి తీసుకోక పోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని గద్దర్ అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీఎల్ యాదగిరి, నల్లమల్ల మురళీ, జక్క గోపాల్, చందర్, మాలల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేర బాలకిషన్, బీఎస్పీ రాష్ట్ర కోర్డినేటర్ ఇబ్రాం శేఖర్ వేర్వేరు ప్రకనటలో డిమాండ్ చేశారు. గతంలో ప్రభుత్వాలు ఇచ్చిన అవార్డులను సైతం గద్దర్ తిరస్కరించిన చరిత్ర నీకు తెలియదన్నారు. గద్దర్ బతికి ఉన్న సమయంలో నీవు ఇలాంటి మాటలు మాట్లాడితే నీవు ఎక్కడ ఉండే వాడివో తెలిసిపోయేద న్నారు. బండి సంజయ్ పై చర్యలు తీసుకోక పోతే బీజేపీ భూస్థాపితం చేస్తామన్నారు.

బేషరతుగా క్షమాపణ చెప్పాలి..

హిమాయత్‌నగర్: గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఏఐ వైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలి ఉల్లాఖాద్రీ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తన ఆట,పాటలతో ప్రజలను చైతన్య పరుస్తూ ప్రపంచ ఖ్యాతి పొందిన గద్దర్‌పై అర్థ రహితంగా బండి సంజయ్ మాట్లాడటం సిగ్గు చేటని విమర్శించారు.

హైడ్రాను కోర్టుకీడుస్తాం..

సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి, సంపత్ రెడ్డి, రాజిరెడ్డి

ఖైరతాబాద్, జనవరి 28 : అకారణంగా తమ ఆస్తులను ధ్వంసం చేసిన హైడ్రాను కోర్టుకీడుస్తానని, పరువునష్టం దావా వేస్తానని విద్యా సంస్థల అధినేత నల్ల మల్లారెడ్డి అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైడ్రా అధికారులు ఏకపక్షంగా తమ గోడు వినకుండా పట్టా భూముల్లో నిర్మించుకున్న తమ ఇంటి ప్రహరీతో పాటు తమ వ్యసాయ భూమి చుట్టూ వేసిన ఫెన్సింగ్‌ను కూల్చివేసి కోట్లాది రూపాయల నష్టం చేశారన్నారు. అన్ని పత్రాలు, అనుమతులు చూపించినా వినకుండా హైడ్రా కమిషనర్‌ను ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారన్నారు. ఈ విషయం కోర్టును ఆశ్రయించామని, తమ పరువుకు భంగం కలిగించేలా ప్రవర్తించారని, వారిపై పరువు నష్టం దావా కూడా వేస్తానన్నారు. దివ్యనగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎండీ హైదర్, సలహాదారుడు రాజి రెడ్డి మాట్లాడుతూ మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం పోచారం మున్సిపాలిటీలోని కాచవాణి సింగారంలో సర్వే నంబరు 44, 45, 47, 48, 52, 64, కొర్రెముల గ్రామంలోని సర్వే నంబరు 719, 720లలోని సుమారు 250 ఎకరాల స్థలంలో 11 లేఅవుట్లలో 3,500 మంది వివిధ ఉద్యోగాలు చేస్తూ ప్లాట్లు కొనుక్కున్నామన్నారు. హైడ్రా సిబ్బంది వచ్చి పదుల సంఖ్యలో బుల్డోజర్లు తీసుకువచ్చి నాలుగు కిలోమీటర్ల కాంపౌండ్ వాల్, రోడ్డుపై ఉన్న డివైడర్లు, ఫెన్సింగ్‌ను కూల్చివేశారన్నారు. సమావేశంలో దివ్యనగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఉషా కాంత్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశం

సిటీబ్యూరో, జనవరి 28 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన ఈ నెల 30న సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ మేరకు జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కౌన్సిల్ సందర్భంగా వివిధ పార్టీల సభ్యుల నుంచి 125 ప్రశ్నలు రాగా..అందులో 19 ప్రశ్నలను ఎంపిక చేశారు. వీటిలో పారిశుధ్యం, టౌన్‌ప్లానింగ్, అకౌంట్స్, కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులు , ఎస్టేట్ విభాగాల ప్రశ్నలపై హాట్ హాట్‌గా చర్చ జరగనుంది. కాగా ఏడాది కాలంగా పేరుకుపోయిన సమస్యలపై అధికార పార్టీని నిలదీసేందుకు బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు సిద్ధమవుతున్నారు. ప్రతి మూడు నెలలకోసారి జరగాల్సిన సర్వసభ్య సమావేశం (జనరల్ బాడీ మీటింగ్) జరగాల్సి ఉంది. గత జూలై 6వ తేదీన జరిగిన 9వ పాలక మండలి (సర్వసభ్య సమావేశం) అక్టోబరులో జరపాల్సి ఉంది. కానీ ఐదు నెలలు గడిచిన సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు కమిషనర్, మేయర్ సిద్ధపడ లేదు. స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదించిన ఆర్థిక సంవత్సరం (2025–26)కు సంబంధించిన రూ.8440 కోట్ల బడ్జెట్‌పై కౌన్సిల్ సమావేశంలో ప్రత్యేక చర్చ జరగనుంది.

డిజిటల్ తరగతులు అర్థమయ్యేలా చూడాలి

మేడ్చల్ రూరల్, జనవరి 28: పాఠశాలలో డిజిటల్ తరగతులలోని ఇంగ్లిష్ బోధన విద్యార్థులకు అర్థమయ్యేలా ప్రధానోపాధ్యాయులు చూసుకోవాలని, పదో తరగతి విద్యార్థులు బాగా చదువుకుని వందశాతం ఉత్తీర్ణత సాధించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం సూచించారు. మేడ్చల్ మండలం శ్రీరంగవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం కలెక్టర్ సందర్శించారు. ముందుగా పాఠశాలలోని డిజిటల్ తరగతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సిలబస్ విషయాన్ని అడిగి తెలుసుకుని, మధ్యాహ్న భోజనాన్ని ఎలా అందిస్తున్నారని ఆడిగారు. కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, వంటగది, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఇంగ్లిష్ పాఠాన్ని తెలుగులో చెప్పమని కలెక్టర్ అడుగగా విద్యార్థులు మంచిగా చదివి వినిపించినందుకు సంతోషించిన కలెక్టర్ వారికి పెన్నులను బహూకరించారు.

మేడ్చల్‌లోని శ్రీరంగవరం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతం

నూతన్‌కల్ పల్లె దవాఖాన పరిశీలన..

శ్రీరంగవరం నుంచి పక్కనే ఉన్న నూతన్‌కల్ గ్రామాన్ని కలెక్టర్ సందర్శించి స్థానిక పల్లె దవాఖానను సందర్శించారు. పల్లె దవాఖాన సేవలను పేద ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని ఈ సందర్భంగా వైద్యులను ఆదేశించారు. ఆయన వెంట డీఈవో విజయలక్ష్మి, జిల్లా వైద్యాధికారి రఘునాథ స్వామి, జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత, తహసీల్దార్ శైలజ, ఎంపీడీవో వసంత లక్ష్మి, జిల్లా పరిషత్ సీఈవో కాంతమ్మ పాల్గొన్నారు.

ఉద్యమకారులకు దక్కని సీఎం అపాయింట్‌మెంట్

సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు

మన్సూరాబాద్, జనవరి 28: ఉద్యమ స్ఫూర్తితో ఏర్పడిన తెలంగాణలో ఉద్యమకారులకే గుర్తింపు లేకుండా పోయిందని ఉద్యమకారులకు సీఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ దొరకక పోవడం దురదృష్టకరమని 1969 తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు చక్రహరి రామరాజు ఎద్దేవా చేశారు. 1969 ఉద్యమకారుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశాన్ని మంగళవారం మన్సూరాబాద్ డివిజన్ పరిధి ఇందిరానగర్ కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రహరి రామరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చేందుకు జరిగిన నాటి ఉద్యమంలో 369 మంది ఉద్యమకారులు పోలీసుల తూటాలకు బలవ్వడమే కాకుండా ఆనాటి విద్యార్థులు ఒక సంవత్సరం విద్యా సంవత్సరాన్ని కోల్పోయారని గుర్తుచేశారు. సీఎం వెంటనే తమకు అపాయింట్‌మెంట్ ఇచ్చి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రావు, ఉపాధ్యక్షుడు వనం చంద్రమౌళి, సీతారాంరెడ్డి, కోశాధికారి ఏళ్ల చంద్రారెడ్డి, కార్యదర్శి విశ్వేశ్వర్‌రావు, సభ్యులు బొమ్మిడి లక్ష్మీనారాయణ, భాస్కర్‌శర్మ, ముత్తినేని వెంకటేశ్వరరావు, కూతురు కృష్ణమూర్తి, కత్రం బాబురెడ్డి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

హద్దుల ప్రక్రియలో జాప్యం

సిటీబ్యూరో, జనవరి 28(నమస్తే తెలంగాణ) : హెచ్ఎండీఏ పరిధిలో చెరువుల హద్దుల నిర్ధారణ సాగుతూనే ఉంది. నెల రోజుల వ్యవధిలో 150 కిపైగా చెరువులకు హద్దులను నిర్ధారించి తుది నోటిఫికేషన్ జారీ చేశారు. మొత్తంగా గడిచిన 9నెలలుగా సాగుతున్న ఈ ప్రక్రియలో 849 చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్ చేయగా.. 2043 చెరువులు ప్రాథమిక హద్దుల నిర్ధారణ జరిగిన జాబితాలో ఉన్నాయి. అయితే హెచ్ఎండీఏ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల మధ్య తలెత్తున్న సమన్వయ లోపం కారణంగా హద్దుల నిర్ధారణలో ఇబ్బంది అవుతుందని, దీంతోనే ప్రక్రియ జాప్యం జరుగుతున్నట్లుగా హెచ్ఎండీఏ లేక్ విభాగం సిబ్బంది చెబుతున్నారు. ఇటీవల హెచ్ఎండీఏ పరిధిలో చెరువుల పరిరక్షణపై హైకోర్టు సీరియస్ వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. దీంతో హద్దుల నిర్ధారణ ప్రక్రియను వేగవంతం చేస్తున్న.. క్షేత్రస్థాయిలో తలెత్తున్న ఇబ్బందులు కొంత కాలయాపన జరుగుతున్నట్లుగా హెచ్ఎండీఏ వర్గాలు వివరించాయి.

ఆపద మిత్రకు దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో, జనవరి 28 (నమస్తే తెలంగాణ) : ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేలా భూకంపాలు, అగ్ని, తుఫాన్లు తదితర రెస్క్యూ ఆపరేషన్‌లపై ఆపద మిత్ర ద్వారా అవగాహన పొందేందుకు యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు హైదరాబాద్ అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి తెలిపారు. స్వచ్ఛందంగా సేవ చేయడానికి ఆస క్తి ఉన్న వాళ్లు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు 18 ఏండ్లు పైబడిన వారై ఉండాలని సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా యువజన కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 2 లోపు పంపించాలని కోరారు.

రాష్ట్ర ఈఎస్ఐ కార్పొరేషన్ ఏర్పాటుపై నిరసన

బన్సీలాల్‌పేట్, జనవరి 28 : ఈఎస్ఐ దవాఖానలు, డిస్పెన్సరీల ద్వారా 20 లక్షల మంది కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న బీమా వైద్య సేవల శాఖను మూసివేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి కుట్ర పూరితంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను తాము వ్యతిరేకిస్తున్నామని టీఎన్జీవో బీమా వైద్య సేవల శాఖ (ఈఎస్ఐ) డైరెక్టరేట్ యూనిట్ నాయకులు అన్నారు. మంగళవారం డైరెక్టరేట్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. డైరెక్టరేట్ సిబ్బందికి తెలియకుండా రహస్యంగా ప్రభుత్వం రాష్ట్ర కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రతిపాదించడం దుర్మార్గపు చర్య అని నగర సంయుక్త కార్యదర్శి అపరంజీ, డీఐఎంఎస్ యూనిట్ వ్యవస్థాపక అధ్యక్షుడు వీరన్న గౌడ్, యూనిట్ ప్రస్తుత అధ్యక్షుడు ప్రవీణ్ అన్నారు.

కెనరా క్రెస్ట్‌తో మెరుగైన సేవలు

సిటీబ్యూరో, జనవరి 28(నమస్తే తెలంగాణ) : హై నెట్ వర్త్ కలిగిన వ్యక్తులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు కెనరా బ్యాంక్ దేశంలోని తొలిసారిగా ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. కెనరా క్రెస్ట్ పేరిట బ్యాంకింగ్ సేవలను కలిగించేందుకు ఏర్పాటు చేసింది. క్రెస్ట్, క్రెస్ట్ ప్లస్ సెగ్మంట్లలో రూ. 10లక్షల నుంచి 50లక్షల లోపు, రూ. 50లక్షలకు పైగా డబ్బులు కలిగిన ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించనున్నారు. కెనరా క్రెస్ట్ ద్వారా ప్రత్యేక సేవింగ్ ఖాతాతోపాటు, ప్రత్యేక రిలేషన్‌షిప్ మేనేజర్‌తో పాటు, ప్రీమియం డైనింగ్ ఆఫర్లు, ఫిట్‌పాస్ ప్రో మ్యాక్స్ మెంబర్‌షిప్, లగ్జరీ హోటల్స్, ప్రాధాన్యత ప్రకారం బ్యాంకింగ్ సేవలను అందుతాయని కెనరా బ్యాంక్ విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది.

శివారు ప్రాంతాల్లో బీటీ రోడ్లు

సిటీబ్యూరో, జనవరి 28(నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో మెరుగైన రవాణా, మౌలిక సదుపాయాల కల్పనపై ఎట్టకేలకు హెచ్ఎండీఏ అధికారులు దృష్టి సారించారు. శివారు ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఔటర్ రింగు రోడ్డు సర్వీస్ లైన్లకు సులభంగా చేరుకునేలా రవాణా సౌకర్యాలను కల్పిస్తున్నారు. రూ. 14.5 కోట్ల అంచనా వ్యయంతో శివారు ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణం చేయనున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని జవహర్ నగర్ పరిధిలో దమ్మాయిగూడ చౌరస్తా నుంచి తిమ్మాయిపల్లి చౌరస్తా మీదుగా, చెన్నాపురం, డెంటల్ కాలేజీ మార్గానికి మరమ్మతులు చేయనున్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలో దయారాకుంట నుంచి కోమటి కుంటకు సీవరేజీ మళ్లించేందుకు వీలుగా బాక్స్ డ్రైన్ల నిర్మాణం, తూంకుంట ప్రధాన జంక్షన్ నుంచి మందాయిపల్లి గ్రామ పరిధి వరకు బీటీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

గాంధీకి ఉత్తమ బ్లడ్ బ్యాంక్ అవార్డు

బన్సీలాల్‌పేట్, జనవరి 28 : తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ద్వారా గాంధీ దవాఖాన బ్లడ్ బ్యాంక్ ఉత్తమ బ్లడ్ బ్యాంక్‌గా అవార్డు అందుకున్నదని సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్.ఎన్.రాజకుమారి తెలిపారు. ఈ మేరకు ఆర్ఎంఓ డాక్టర్ శేషాద్రితో కలిసి ఆమె మంగళవారం బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ సరిత, సిబ్బందిని అభినందించారు. గతేడాది కాలంలో 52 రక్తదాన శిబిరాలను నిర్వహించి, 14 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించి నిరుపేద రోగులకు అందించినట్లు ఆమె తెలిపారు.

బ్లడ్ బ్యాంక్ సిబ్బందిని అభినందించిన డాక్టర్ రాజకుమారి, శేషాద్రి

టీడీసీఏ టీ20 క్రికెట్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) నిర్వహిస్తున్న అండర్–17 టీ20 టోర్నీలో పాలమూరు, ఆదిలాబాద్ జట్లు సత్తాచాటాయి. మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో మెదక్‌పై మహబూబ్‌నగర్ 33 పరుగుల తేడాతో గెలిచింది. తొలుత మహబూబ్‌నగర్ 20 ఓవర్లలో 178/8 స్కోరు చేసింది. లక్ష్యచేదనలో మెదక్ 20 ఓవర్లలో 145/9 స్కోరుకు పరిమితమైంది. మరో మ్యాచ్‌లో నిజామాబాద్‌పై టీడీసీఏ ఎలెవన్ 42 పరుగుల తేడాతో గెలిచింది. స్వరూప్(45) రాణించడంతో టీడీసీఏ ఎలెవన్ 20 ఓవర్లలో 169/8 స్కోరు చేసింది. నిజామాబాద్ 17.2 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటైంది.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

అడ్డగూడూరు గురుకుల పాఠశాలలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నాగరాజు

అడ్డగూడూరు, జనవరి 28 : మండలంలోని సాంఘిక సంక్షేమ పాఠశాలలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మంగళవారం ఎస్ఐ నాగరాజు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రోడ్డుకు సంబంధించిన నియమాలు, డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, లైసెన్స్, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం, సిగ్నల్ జంప్ గురించి వివరించారు.

మాజీ కౌన్సిలర్ అఖిలబలరామ్‌కు సన్మానం

కౌన్సిలర్ అఖిల బలరామ్‌ను సత్కరిస్తున్న కాలనీవాసులు

భూదాన్ పోచంపల్లి, జనవరి 28 : పట్టణంలోని 11వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకులు కుడికాల అఖిలబలరామ్‌ను కాలనీవాసులు మంగళవారం సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎలగందుల నర్సింహ, కడవేరు రామేశ్వర్, వేముల శ్రీశైలం, బోడ దయానంద్, ముషం స్వామి, బోగ శ్రీను, కృష్ణ, శ్రవణ్, మహేశ్, సురేశ్, భాను, హేమంత్, సంతోష్, నరేందర్, రమణ, భాస్కర్, లింగస్వామి, రామకృష్ణ, విష్ణు పాల్గొన్నారు.

డీసీసీ ఉపాధ్యక్షుడిగా సోమిరెడ్డి

మోత్కూరు, జనవరి 28 : డీసీసీ ఉపాధ్యక్షుడిగా తనను నియమాకం చేస్తూ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారని మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన పైళ్ల సోమిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, మందుల సామేల్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుడు వెంకట్రాంరెడ్డి బంగారు గొలుసు అపహరణ

రాజాపేట, జనవరి 28 : మండలంలోని రేణికుంట గ్రామానికి చెందిన నల్లగొండ – రంగారెడ్డి జిల్లాల మదర్ డెయిరీ మాజీ డైరెక్టర్ చింతలపూరి వెంకట్రాంరెడ్డి మంగళవారం నల్లగొండలో జరిగిన రైతు మహాధర్నాకు వెళ్లారు. ధర్నా వేదిక వద్దకు కేటీఆర్ వస్తున్న క్రమంలో జిల్లా కో ఆపరేటివ్ కార్యాలయం వద్ద స్వాగతం పలికే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వెంకట్రాంరెడ్డి మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసును అపహరించుకుపోయారు. దాని విలువ రూ.1.60 లక్షల విలువ ఉంటుందని వెంకట్రాంరెడ్డి తెలిపారు.

మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యం

కొలనుపాకలో స్వయం ఉపాధి సదస్సుకు హాజరైన మహిళలు

ఆలేరు రూరల్, జనవరి 28 : మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే తన లక్ష్యమని సంతోష్ యువసేన ప్రతినిధి భీమగోని సంతోష్‌నాయక్ అన్నారు. మండలంలోని కొలనుపాకలో మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 5 రకాల ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో నీల కవిత, గడ్డం అనిత, గీత, సుహాసిని, రాధ, అరుణ, భార్గవి, అనసూయ, అరుణ, జ్యోతి, భాగ్య, సుజాత, రేవతి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

యాదగిరిగుట్ట, జనవరి 28 : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం ఈదులూరు గ్రామానికి చెందిన షేక్ గాలిబ్ (45) యాదగిరిగుట్టలోని పద్మజా లాడ్జి రూమ్‌లో మంగళవారం విగతజీవిగా పడి ఉన్నాడు. లాడ్జి నిర్వాహకులు ఇచ్చిన సమాచారంతో సంఘటన స్థలికి చేరుకుని మృతదేహన్ని స్వాధీనం చేసుకుని భువనగిరి జిల్లా ఆసుపత్రికి తరించారు. క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరిస్తున్నామని సీఐ తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

సీఎస్ఐఆర్ - నీరీ డైరెక్టర్‌గా వెంకటమోహన్

సిటీబ్యూరో, జనవరి 28(నమస్తే తెలంగాణ): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో చీఫ్ సైంటిస్ట్‌గా సేవలు అందిస్తున్న డా. ఎస్ వెంకటమోహన్ నాగ్‌పూర్‌లోని ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు డైరెక్టర్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. 1998 నుంచి ఐఐసీటీలో పరిశోధన రంగంలో సేవలు అందిస్తున్నారు. శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేసిన ఆయన.. పలు అంతర్జాతీయ పరిశోధన, అకాడమీ సంస్థలకు ప్రాతినిధ్యం వహించారు. క్యోటో యూనివర్సిటీలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా, జర్మనీలోని అలెగ్జాండర్ వోన్ టెక్నికల్ వర్సిటీకి ఫెలోగా సేవలు అందించారు. కాగా శాస్త్ర, సాంకేతిక రంగంలో అత్యున్నత పరిశోధనలతో విశేషంగా కృషి చేసిన డా. వెంకటమోహన్ నీరీ డైరెక్టర్‌గా ఎంపిక కావడంపై ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పరిశోధకులు హర్షం వ్యక్తం చేశారు.